ప్రైవేటుకు దీటుగా ప్రవేశాలే లక్ష్యంగా..

ప్రాథమిక విద్య బలోపేతంపై ప్రభుత్వం దృష్టి ● మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 60 పాఠశాలల్లో అమలుకు కసరత్తు

సాక్షి,సిటీబ్యూరో: ప్రాథమిక విద్య బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన ప్రీ ప్రైమరీ తరగతులు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మధ్యతరగతి ప్రజలకు భారం తగ్గించేందుకు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసం కొంతవరకు జరుగుతున్నా.. ఎక్కువ శాతం ప్రైవేటు పాఠశాలల్లోనే ఈ విధానం కొనసాగుతోంది. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రాథమిక స్థాయి నుంచే ఆర్థికభారాన్ని ఎదుర్కొంటున్నారు. 1వ తరగతి నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో చదువునే అవకాశం ఉంది. ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నడుస్తున్నాయి.

మూడేళ్లు నిండగానే స్కూలుకు..

పిల్లలకు మూడేళ్లు నిండగానే తల్లిదండ్రులు ప్రైవేటులో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తుండటంతో ఫలితంగా ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పెరగడం లేదు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఎంపిక చేసిన బడుల్లో ఈ విద్యాసంవత్సరం నుంచే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ బోధనలు అందించేందుకు ఆదేశాలు జారీ చేసింది.

60 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు..

రాష్ట్రవ్యాప్తంగా 210 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ బోధనలు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలోనే నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 60 పాఠశాలలు ఎంపికయ్యాయి.

ఉన్నతాధికారులకు నివేదిక..

ప్రీ ప్రైమరీ బోధనలు నిర్వహించ తలపెట్టిన పాఠశాలల సమాచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు జిల్లా విద్యాశాఖ నివేదించినట్లు తెలుస్తోంది. ఈ నివేదికకు ఆమోదముద్ర పడగానే అమలు చేసేందుకు పూర్తి ఏర్పాట్లతో జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యను బోధించేందుకు ఆసక్తి ఉండి ముందుకొచ్చిన పాఠశాలల్లోనే కొత్తగా ప్రీ ప్రైమరీ విద్యను అమలు చేయనున్నారు.

ఆటపాటలతో బోధనలు..

5 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రవేశాలు కల్పిస్తూ విద్యా సంవత్సరం నుంచే ఆటపాటల బోధనలతో పాటు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందజేయనున్నారు. ఎంపికైన స్కూళ్లకు గ్రాంట్‌తో పాటు బోధనకు వాలంటీరు, ఆయాల నియామకాన్ని చేపట్టనున్నారు. 10 నెలల కాలానికి ఒక్కో వాలంటీర్‌కు రూ.8 వేలు, ఆయాకు రూ. 6 వేల చొప్పున చెల్లించనున్నట్లు విద్యాశాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి.

100 శాతం ప్రవేశాలకు కృషి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న కమిషనర్ పవన్‌కుమార్

శామీర్‌పేట్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అధికారులు, నాయకులు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లక్ష్మాపూర్‌లో 100 శాతం ప్రవేశాలే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

◆ లక్ష్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు స్వప్న 'బడిబాట' నిర్వహించారు. శుక్రవారం విద్యాశాఖ అధికారి ఏఎంఓ రవీందర్ రాజు, ఎంఈఓ భాగ్యమణిలు మాట్లాడుతూ... పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచే కార్యక్రమం ప్రతీ పాఠశాలలో నిర్వహించాలని, లక్ష్మాపూర్ ప్రాథమిక పాఠశాలను స్థానిక ఐఐఎల్ కంపెనీ యాజమాన్యం సహకారంతో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలను కల్పించామన్నారు. మున్సిపల్ మేనేజర్ శోభారాణి, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం, మధు కృష్ణ, నాయకులు గోపి, నర్సిములు, పాండు, ఉపాధ్యాయులు అనిత, వినోద, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మను చౌదరి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మనుచౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థాన అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, జిల్లాస్థాయి అధికారులు, ఎమ్మార్వోలు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందచేసి కలెక్టర్‌కు స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమ్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దీంతో సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మిక్కిలినేని మను చౌదరిని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు బదిలీ చేస్తూ.. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం దెందులూరు గ్రామానికి చెందిన మిక్కిలినేని మను చౌదరి 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. తండ్రి రాజబాబు ఓరియెంట్ సిమెంట్‌లో సీనియర్ కెమిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి భారతి గృహిణి కాగా ఓ సోదరుడు ఉన్నారు. మను చౌదరి 2015లో పీజీడీఎం పూర్తి చేసిన తర్వాత సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు.



ఇంతక ముందు కలెక్టర్‌గా పనిచేసిన గౌతమ్‌కు వీడ్కోలు పలుకుతున్న అదనపు కలెక్టర్లు, సిబ్బంది

గౌతమ్‌కు ఘనంగా వీడ్కోలు..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా బదిలీ అయిన గౌతమ్ పొట్రును జిల్లా అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. గౌతమ్ పొట్రు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా 2023 అక్టోబర్ 13న బాధ్యతలు స్వీకరించి 20 నెలల పాటు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, కలెక్టరేట్ ఏఓ రామ్మోహన్, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, జిల్లాలోని వివిధ మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు జ్ఞాపికను అందజేసి, శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



కిష్టాపూర్‌లో పట్టాలు అందజేస్తున్న అధికారులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కిష్టాపూర్‌లో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నేతలు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేశారు. శుక్రవారం కిష్టాపూర్‌లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ పరిధిలో అర్హులందరికి ఇళ్లు అందేలా చూస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కమిషనర్ నాగిరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుధాకర్, నాగార్జున్‌రెడ్డి, నవీన్, మహేష్, రాజు, నాగిరెడ్డి ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



రైల్వేస్టేషన్ రోడ్డు పాఠశాలలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఏంఈఓ శంకరయ్య



గోధుమకుంట ప్రాథమిక పాఠశాలలో..

మేడ్చల్: జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు వివిధ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. శుక్రవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాథమిక పాఠశాలలో 1వతరగతి విద్యార్థుల చేత అధికారులు అక్షరాలు దిద్దించారు. సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి పిల్లల చేత పలకలపై అక్షరాలు దిద్దారు. ఎంఈఓ శంకరయ్య, హెచ్‌ఎంలు పద్మనాభం, మంజుల, రాజిరెడ్డి, ఏఏపీసీ చైర్మన్ జ్యోతీశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కీసర: గోధుమకుంట వార్డు కార్యాలయంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి హాజరై విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి, ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను తెలియజేశారు. ఏఏపీసీ చైర్మన్ మమత, ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అహ్మదాబాద్ మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మేడ్చల్‌రూరల్: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ప్రయాణికులు మృతిచెందడం అత్యంత బాధాకరమని జనవిజ్ఞాన వేదిక నాయకుడు వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లిలోని సాకేత్ ప్రణామంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు సాయంత్రం 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం విమాన ప్రమాద మృతులకు నివాళులర్పించారు. రామకృష్ణరాజు, శ్రీరామ్ మూర్తినాయుడు, కుమారి, రాధిక, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తపై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర: 100 రోజుల ప్రణాళికలో భాగంగా నాగారం మున్సిపల్ పరిధిలోని రచ్చ రామ్‌రెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. చెత్తను వేరు చేసిన మున్సిపల్ వాహనాలకు అందివ్వాలన్నారు. రోజువారి కార్యక్రమాల్లో మిగిలిన తడి చెత్తను తమ ఇంట్లోనే కంపోస్ట్ ఎరువు తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. మేనేజర్ సురేష్‌రెడ్డి, జాతీయ పోషకాహార అధికారి రుషికేష్, మెప్మా ఎండీఎంసీ నర్సింహ పాల్గొన్నారు.

డ్రైనేజీని కలపొద్దని కమిషనర్‌కు వినతి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మాణిక్యరెడ్డినగర్ కాలనీలోకి అపార్ట్‌మెంట్ డ్రైనేజీని కలపొద్దని కాలనీవాసులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ స్వామికి వినతిపత్రం అందజేశారు. గతంలో లక్ష్మీనగర్ కాలనీలోని పలు ఇళ్ల డ్రైనేజీ నీటికి కలిపారని, మరోసారి అపార్ట్‌మెంట్ డ్రైనేజీ నీటిని కలిపితే మ్యాన్‌హోల్స్ వద్ద ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. హెచ్‌ఎండీఏ అనుమతుల ప్రకారం అపార్ట్‌మెంట్ యాజమాన్యం ఎస్‌టీపీ ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని, మున్సిపల్ నిధులతో డ్రైనేజీ సౌకర్యం కల్పించడం ఎందుకని ప్రశ్నించారు. మాజీ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, హేమంత్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

17న జరిగే సర్వేకు సహకరించండి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ముత్వెల్లిగూడలో సర్వే నం.82, 83లో ఈనెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు రెవెన్యూ అధికారులు నిర్వహించే సర్వేకు ప్రజలు సహకరించాలని ఆ గ్రామ రైతు నర్సింగరావు కోరారు. శుక్రవారం ముత్వెల్లిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు సర్వే నం.83/లూ లో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు తీసుకొని సర్వే నం.1లో కడుతున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో భూమిని సర్వే చేసేందుకు సర్వేయర్ అంగీకరించారని చెప్పారు. గతంలో సర్వే జరగకుండా కొంత మంది అడ్డుకున్నారని, ఇప్పటికైనా ఈ నెల 17న జరగనున్న సర్వేకు స్థానికులు సహకరించాలని కోరారు.

ఎట్టకేలకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

కీసర: సాక్షి దినపత్రికలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో, వ్యవసాయ క్షేత్రాలు, పలు కాలనీల మధ్య ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంభాల సమస్యలపై శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'పొంచి ఉన్న ప్రమాదం'అనే కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. కీసర విద్యుత్ అధికారి (ఏఈ) మురళీకృష్ణ శుక్రవారం కీసర, కీసరదాయర ప్రాంతాల్లో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయించారు. అదేవిధంగా వ్యవసాయ క్షేత్రం వద్ద ఒకవైపు వాలిన విద్యుత్ స్తంభాన్ని సైతం సరి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కీసర సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.





నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



అవుషాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు



గిర్మాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ఘట్‌కేసర్: 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి లావణ్య ఆధ్వర్యంలో అంకుషాపూర్, అవుషాపూర్‌లో గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ బలరాం, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి సాగువ్యయం తగ్గించుకోవాలన్నారు. అధిక దిగుబడుల కోసం నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ పోచిరెడ్డి, మాజీ సర్పంచ్ బిక్షపతిగౌడ్, మశ్చేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్, మండల వ్యవసాయ సహాయ అధికారి జగదీశ్, రైతులు గోపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

మేడ్చల్: వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో శాస్త్రవేత్తలు రైతుల కోసం చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిర్మాపూర్, రావల్‌కోల్ ,బండకుంట గ్రామాలలో శుక్రవారం పర్యటించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో సమావేశం నిర్వహించి శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక పద్ధతుల్లో సాగుపై అవగాహన కల్పించారు. స్వల్పకాలిక వంగడాలు, నీటి తక్కువ లభ్యతతో సాగుచేయాల్సిన పంటల గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వసంత, పుష్పవల్లి, స్వర్ణలత, ఎంఏఓ అర్చన, ఏంఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

శామీర్‌పేట్: భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపాలిటీ నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, అలియాబాద్ మాజీ సర్పంచ్ కంటం కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరి, సొసైటీ మాజీ డైరెక్టర్ నాగమల్లారెడ్డి, కాంగ్రెస్ నేతలు గాదె వెంకటేష్, శశిధర్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



పోచారం: గంజాయి కేసులో ప్రధాన నిందితుడితో పాటు అతని అనుచరులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ జూపల్లి రవి తెలిపిన ప్రకారం.. ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు సోదాలు చేశారు. చెంగిచర్ల చెరువు సమీపంలో సఫిల్‌గూడకు చెందిన వేముల జాన్ బనియన్ అలియాస్ జాన్ (29), ఈసీఐఎల్ కమలానగర్‌కు చెందిన అథవ మోహన్ వెంకట్ (29), చెంగిచర్లకు చెందిన మనీష్ ఉపాధ్యాయ్ (26), మౌలాలికి చెందిన జూపల్లి రవితేజ (27), దాసరి విశాల్ (21) గంజాయి సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కారు. వీరి వద్ద లభించిన 10.440 కిలోల ఎండు గంజాయి, కారు, బైక్, ఐదు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సాలోని కోరాపుట్ జిల్లా, సుంకి గ్రామంలో జైన్ మామా నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు వేముల జాన్ బనియన్ విచారణలో ఒప్పుకున్నాడు.

◆ అక్కడి నుంచి గంజాయిని రైలులో హైదరాబాద్‌లోని సఫిల్‌గూడకు తీసుకొచ్చి కారు ద్వారా పంపిణీ చేసి మనీష్, విశాల్, మోహన్ వెంకట్, జూపల్లి రవితేజలకు అప్పగించాడు. మనీష్, విశాల్ చెంగిచర్ల ప్రాంతంలో గంజాయిని విక్రయిస్తున్నారు. మోహన్ వెంకట్ సఫిల్‌గూడలో, జూపల్లి రవితేజ రాంపల్లిలో అమ్ముతున్నారు. 15 గ్రాముల ప్యాకెట్‌ను రూ. 1000 చొప్పున విక్రయించి, లాభంలో 10 శాతం తీసుకుంటాడు. జాన్ బనియన్ గతంలో పలు నేరాలకు పాల్పడ్డాడు. ముద్దాయిలపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టు ద్వారా వారిని రిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కీసర: తెలంగాణ క్రీడా పాఠశాల నాల్గో తరగతి ప్రవేశానికి మండల స్థాయిలో విద్యార్థుల ఎంపిక జరుగనుందని ఎంఈవో జమదగ్ని తెలిపారు. జ్ఞిఇటః//ఁజటట్ఛ్చ౧ఽజ్చ్బ.జౌౖ.జీ౯ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, నాల్గో తరగతి బోనఫైడ్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, కుల ధ్రువీకరణ పత్రం, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు మండల విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా శనివారం, ఆదివారం మండల కార్యాలయం తెరిచే ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 62816 07774.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు సరిత

జవహర్‌నగర్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు గోగుల సరిత అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ, సమత హైదరాబాద్, సీఆర్‌వై సంయుక్తాధ్వర్యంలో జవహర్‌నగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని సమాజం వ్యతిరేకించినప్పుడే దీనికి పరిష్కారం దొరుకుతుందన్నారు. చదువు, ఆట, ఆరోగ్యమే బాల్యానికి అవసరమన్నారు. ఎస్‌హెచ్‌ఓ సైదయ్య, సమతా ఉప కన్వీనర్ డాక్టర్ రజినీ, సీఆర్‌వై ప్రతినిధి హిమబిందు, ఎస్సై కృష్ణ, నాయకులు రాజా, ఆనంద్‌కుమర్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: వర్షాకాలంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం 11 కేవీ అవుషాపూర్ ఫీడర్ పరిధిలోని అవుషాపూర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ హెచ్‌పీసీఎల్ ఫీడర్ పరిధిలోని హెచ్‌పీసీఎల్, వీబీఐటీ కళాశాల, శ్రీ చైతన్య కళాశాల ప్రాంతంలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, 11 కేవీ శివారెడ్డిగూడ ఫీడర్ పరిధిలోని శివారెడ్డిగూడ, ఘనాపూర్‌లో సాయంత్రం 4.00 నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

టీసీ కావాలంటే రూ.200 !

మేడ్చల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థికి టీసీ కావాలంటే విద్యార్థులు రూ.200 చెల్లించాల్సిందే. పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, ఇతర కారణాలతో స్కూల్‌ను వదిలి వెళ్లి మరో స్కూల్‌కు వెళ్లే వారికి టీసీ తప్పనిసరి . దీంతో టీసీ జారీచేసే ఉపాధ్యాయులు టీసీ కావాలంటే విద్యార్థులు రూ.200 విద్యార్థులు తమకు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 60 మంది వరకు ఈ సంవత్సరం స్కూల్‌ను వదిలి వెళ్లిపోతుండగా.. వారిని డబ్బులు అడిగినట్లు సమాచారం.

అలాంటిది ఏమీ లేదు.

తమ పాఠశాలలో టీసీ కోసం రూ.200 అడుగుతున్న మాట పూర్తిగా అవాస్తవం. ఎవరి వద్ద ఎవరూ.. ఎలాంటి డబ్బులు అడగడం లేదు. పాఠశాల నుంచి వెళ్లిపోతున్న విద్యార్థులకు గతంలో ప్రభుత్వం తరుపున అందజేసిన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ తిరిగి తీసుకుంటున్నాం.

– అనంత పద్మనాభం, ప్రధానోపాధ్యాయులు

ఎలాంటి నిబంధన లేదు.

పిల్లలకు టీసీ అవసరమైతే ఎలాంటి నిబంధనలు లేకుండా వారికి టీసీ ఇవ్వాల్సిందే. డబ్బులు తీసుకోవడంపై ఎలాంటి నిబంధన లేదు. అది పూర్తిగా చట్ట వ్యతిరేకం. బాలుర పాఠశాలలో టీసీ కోసం డబ్బులు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి రాలేదు. తగిన విచారణ చేపడతాం.

– శంకరయ్య, ఏంఈఓ మేడ్చల్

ఆపరేషన్ కగార్‌ను వెంటనే విరమించుకోవాలి


తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్



సమావేశంలో మాట్లాడుతున్న వెన్నెల గద్దర్

జవహర్‌నగర్: క్రాంతి కళా బృందం ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో శుక్రవారం ×ఆదివాసీ హననం ఆపండి.. శాంతి చర్చలు జరపండి×అంటూ అఖిలపక్ష నాయకుల సమక్షంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై మారణహోమం సృష్టించడం దుర్మార్గమని అన్నారు. నక్సలైట్లు దొంగలు, రేపిస్టులు కాదని సామాన్య పౌరులేనని వారిపై కేంద్ర ప్రభుత్వం పారా మిలటరీ బలగాలను మోపుతూ చంపుతుండటం సరికాదన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే విరమించుకోవాలని అన్నారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీన ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, ఉమామహేష్, అనురాధ, చంద్రమౌళి, షేక్ షావలి, నగేష్, యాదగిరి, మీరా, శివబాబు, వెంకటాచారి, సునీత, నాగరాజు, ప్రకాష్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

వయోధికుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి



ఘట్‌కేసర్‌లో నిరసన చేస్తున్న సీనియర్ సిటిజన్లు

ఘట్‌కేసర్ : 'తెలంగాణ ఆల్‌స్టేట్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్' (టాస్కా) ఆధ్వర్యంలో వయోధికుల హక్కుల పరిరక్షణ కోసం ఘట్‌కేసర్‌లో శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన వయోధికుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవితాంతం దేశాభివృద్ధికి పునాదులు వేసిన వృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని, రైల్వే ప్రయాణంలో రాయితీని పునరుద్ధరించాలన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. టాస్కా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు రంగయ్య, కార్యదర్శి మల్లారెడ్డి, రాజయ్య, వేణుమాధవ్, పృథ్వీరాజ్‌గౌడ్, రాజిరెడ్డి, సోమయ్య, జగదీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, పోచిరెడ్డి, యాదిరెడ్డి, నాగరాజు, మల్లయ్య, నర్సయ్య, రాజనర్సు, శ్రీనివాస్, రాజిరెడ్డి, రాజ్‌కుమార్, మునీందర్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.